క్లుప్తంగా

పింఛన్ల పంపిణీ

కడప రూరల్ : ఎన్టీఆర్ భరోసా పథకం కింద కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కడప నగరంలోని ఆలంఖాన్‌పల్లె, గోకుల్ సర్కిల్, శివానందపురం తదితర ప్రాంతాల్లో పింఛన్లను అర్హులకు అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ఆ పార్టీ నేతలు పాల్గొన్నారు.

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని తొమ్మిదవ డివిజన్‌లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. బీజేపీ రాష్ట్ర నాయకులు బత్తల పవన్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అమీర్‌బాష, బాలయ్య, శ్రీను, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలను కలిసిన వైవీయూ రిజిస్ట్రార్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమితులైన ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి సోమవారం జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలను మర్యాదపూర్వకంగా కలిశారు. కడప శాసన సభ్యురాలు ఆర్.మాధవీరెడ్డి , కమలాపురం శాసనసభ్యుడు పుత్తా కృష్ణచైతన్యరెడ్డిలను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. యోగివేమన విశ్వవిద్యాలయం అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వ విధానాల ప్రకారం విశ్వవిద్యాలయ ప్రగతికి పూర్తి సహకారం అందిస్తామని వారు స్పష్టం చేశారని తెలిపారు.

పండ్లు పంపిణీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : నగరంలోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసినట్లు సమాజ్‌వాది పార్టీ ప్రధాన కార్యదర్శి అలిశెట్టి సుబ్బరాయుడు తెలిపారు. సోమవారం తమ నాయకుడు అఖిలేష్ యాదవ్ జన్మదిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నాగేశ్వరరావు, విజయ్‌కుమార్, తేజేశ్వర్, వీరలక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం



అటెండర్ చిన్నయ్యను సన్మానిస్తున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్ : కడప ఎంఈఓ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న చిన్నయ్యను పదవీ విరమణ సందర్భంగా కడప విశ్రాంత ఎంఈఓ పాలెం నారాయణ, ఎంఈఓ–2 ఇర్షాద్ అహ్మద్‌లు ఘనంగా సన్మానం చేశారు. అటెండర్ చిన్నయ్య సేవలను కొనియాడారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు.


అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : ప్రజల అర్జీలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేయవద్దని నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ అన్నారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో మొత్తం 23 అర్జీలు రాగా, ఇంజనీరింగ్ విభాగం అర్జీలు 11, టౌన్ ప్లానింగ్ 6, రెవెన్యూ విభాగం ఒకటి, హెల్త్ విభాగం రెండు ,యూపీఏ విభాగం మూడు అర్జీలు వచ్చాయి. వీటిని సమగ్రంగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

వైవీయూ పీజీ సెమిస్టర్ పరీక్షలు తనిఖీ



పరీక్షలను తనిఖీ చేస్తున్న వైవీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య రఘునాథరెడ్డి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పోస్టు గ్రాడ్యుయేషన్ సెమిస్టర్ పరీక్షలను విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి తనిఖీ చేశారు. విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న పరీక్షలను ఆయన పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థుల హాల్‌టికెట్లను ఆయన పరిశీలించారు. నిర్వహణలో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కాగా సోమవారం నుంచి ప్రారంభమైన న్యాయవిద్య పరీక్షలను పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి తనిఖీ చేశారు.

ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం



కడప కల్చరల్: వైద్యులను సన్మానిస్తున్న ఇంటాక్ ప్రతినిధులు



వైవీయూ: వైద్యులను సత్కరిస్తున్న కళాశాల అధ్యాపకులు

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్, హ్యాండ్స్ ఫర్ యూ స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నేషనల్ డాక్టర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా మాట్లాడుతూ వైద్యులు అందించే సేవల గురించి వివరించారు. హ్యాండ్స్ ఫర్ యూ స్వచ్ఛందసేవా సంస్థ వ్యవస్థాపకుడు పట్టుపోగుల సుబ్బారావు మాట్లాడుతూ వైద్యులు అందించే సూచనలు, సలహాలు పాటించాలన్నారు. విద్యార్థినులు విద్యతో పాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా విచ్చేసిన ప్రముఖ వైద్యులు డాక్టర్ వారణాశి ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ శివబాబు, డాక్టర్ రాజేశ్వరిలు మాట్లాడుతూ ఆహారపు అలవాట్ల గురించి, ఆరోగ్య సంబంధమైన అంశాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం వైద్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు డా. జి. విజయలక్ష్మీదేవి, డా. గురుమోహన్‌రెడ్డి, డా. సుబ్బారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యం ద్వారా మానవ జన్మకు సార్థకత

కడప కల్చరల్ : వైద్యం ద్వారా వైద్యులు తమ మానవ జన్మకు సార్థకత చేకూర్చుకోగలరని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్ అన్నారు. సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవ సందర్భంగా భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) ఆధ్వర్యంలో జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి స్థానిక మానస సమావేశ మందిరంలో సంస్థ సభ్యులైన వైద్యులందరినీ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డాక్టర్ రవీంద్రనాథ్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాష , లయన్ చిన్నపరెడ్డి , సీనియర్, శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ పుత్తా బాలిరెడ్డి , హోమియో వైద్యులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, ఆర్థో వైద్య నిపుణులు డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి, న్యూరో నిపుణులు డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డి, సంప్రదాయ వైద్యులు డాక్టర్ యదుభూషణరావు, మానసిక వ్యాధుల నిపుణులు డాక్టర్ అశోక్‌కుమార్, వైవీయూ పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ఎన్.ఈశ్వర్‌రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా దాదాపు 15 మంది వైద్యులను ఇంటాక్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఇంటాక్ కో కన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య వృత్తికే తలమానికం డాక్టర్ బీసీ రాయ్

కడప ఎడ్యుకేషన్ : ఆల్ మేవా కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జలీల్‌ఖాన్, నజీర్‌బాషల ఆధ్వర్యంలో సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య వృత్తినే దైవంగా భావించి కరోనా లాంటి విపత్కర పరిస్థితులలో కూడా తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి వైద్యులు సేవలందించారన్నారు. అలాంటి వైద్యుల సేవలను ఎన్నటికీ మరువలేమన్నారు. కరోనా సమయంలో అసువులు బాసిన వైద్యలకు జాతీయ వైద్యుల దినోత్సం సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. అనంతరం కడప పట్టణం క్రిష్టియన్ లైన్‌లో రాయలసీమలోనే కడపలో క్యాన్సర్ క్లినిక్‌ను ప్రారంభించిన అసిస్టెంట్ ప్రొఫెసర్, క్యాన్సర్ స్పెషాలిటి డాక్టర్ అనూనుల్లాను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆల్ మేవా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఫరూక్, రాష్ట్ర నాయకులు హబీబుల్లా, జిల్లా నాయకులు మహబూబ్‌బాష, మైనుద్దీన్, మౌలాలి, సనావుల్లా, తబరేజుల్లా, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో ఘనంగా వైద్యుల దినోత్సవం

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల(జీజీహెచ్), ప్రభుత్వ వైద్యశాల (జీఎంసీ) ఆవరణలో సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి ఆవరణలో ఐపీ విభాగంలోని లెక్చర్ హాల్‌లో డాక్టర్లు కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకుని అభినందించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో వున్న మనుషుల ప్రాణాలను కాపాడగలిగేది వైద్యులేనన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. సురేశ్వర్‌రెడ్డి, జనరల్ మెడిసిన్ హెచ్ఓడి డాక్టర్ యాదవేంద్రారెడ్డి, అనస్తీషియా హెచ్ఓడి డాక్టర్ సునీల్ చిరువెళ్ల తదితరులు పాల్గొన్నారు.

■ ప్రభుత్వ వైద్యకళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ ఛాంబర్‌లో డాక్టర్లంతా కలిసి కేక్ కట్ చేశారు. అందరూ తినిపించుకుని జాతీయ వైద్యుల దినోత్సవం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వైద్యుల గొప్పదనాన్ని తెలిపారు.

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని నిహార్ స్కిల్ సెంటర్‌లో సోమవారం మౌలానా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ షబ్బీర్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే, ఆడిటర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రముఖ సీనియర్ వైద్యులు, ఐఎంఏ మాజీ అధ్యక్షుడు నాగేంద్రప్రసాద్, కడప చార్టెడ్ అకౌంటెంట్ బ్రాంచ్ మాజీ చైర్మన్, సికాస మాజీ చైర్మన్ ఆడిటర్ ఖాజా హుస్సేన్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ప్రెసిడెంట్ పాలెంపల్లి జయభారత్‌రెడ్డి, జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్టు అసోసియేషన్ అధ్యక్షులు నరసింహమూర్తిలు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో షేక్ ముజీమ్, డాక్టర్ స్వర్ణలత, సొసైటీ సభ్యులు సిద్దిక్‌అలీ, సయ్యద్ సుల్తాన్, సలావుద్దీన్ పాల్గొన్నారు.



కడప అర్బన్ : రిమ్స్ ఐపీలో కేక్ కట్ చేస్తున్న వైద్యాధికారులు



కడప ఎడ్యుకేషన్ : వైద్యుడు అమానుల్లాను సన్మానిస్తున్న అల్‌మేవా నాయకులు



కడప ఎడ్యుకేషన్: డాక్టర్, ఆడిటర్‌ను సన్మానిస్తున్న మౌలానా ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అధ్యక్షుడు షబ్బీర్ తదితరులు

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి



బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న విద్యార్థి సంఘాల ఐక్యవేదిక నాయకులు

కడప ఎడ్యుకేషన్ : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం 4వ తేదీ తలపెట్టిన కేజీ టు పీజీ విద్యాసంస్థల బంద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విద్యార్థి సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు, ఏబీఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు జగన్‌నాయక్, సీఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీపీ నాగేంద్ర, ఎస్ఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రసన్నకుమార్, టీఆర్ఎస్‌వై జిల్లా అధ్యక్షులు రెడ్డిసాయి పిలుపునిచ్చారు. ఈ విషయమై సోమవారం కడపలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో బంద్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లను విడదలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలన్నారు. ఖాళీగా ఉన్న డీఈఓ, డిప్యూటీ ఈఓ, ఎంఈఓ, ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. అలాగే పాఠశాలల, సంక్షేమ వసతి గృహాల అభివృద్ధికి నిధులను కేటాయించాలన్నారు. అలాగే కడప ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని కోరుతూ 4వ తేదీన విద్యాసంస్థల బంద్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈ నెల 4న చేపట్టనున్న దేశ వ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు పేర్కొన్నారు. సోమవారం కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులతో కలిసి ఈ మేరకు పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజేంద్రప్రసాద్, జిల్లా అధ్యక్షులు రాహుల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు అకిరానంద్, శివతేజ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డయేరియా రాకుండా జాగ్రత్తలు పాటించాలి



స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవీరెడ్డి

కడప రూరల్ : డయేరియా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి అన్నారు. సోమవారం ఎర్రముక్కపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌ను ప్రారంభించారు. అనంతరం మాధవీరెడ్డి మాట్లాడుతూ ఆగష్టు 31వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లలు, తల్లులు, గర్భవతులకు డయేరియా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాచిన నీటిని చల్లార్చి తాగాలని తెలిపారు. ఇంటి పరిసరాలకు శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ అవసరమైన వారికి ఓఆర్ఎస్, జింక్ మాత్రలను పంపిణీ చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్య సదుపాయాలతో పాటు మందులను పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, డాక్టర్ రవిబాబు, డాక్టర్ ఉబేదుల్లా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘన నివాళి

కడప కల్చరల్ : ఇటీవల మృతి చెందిన రంగస్థల నటుడు జల్లా శ్రీరాములు సంస్మరణ సమావేశాన్ని సోమవారం నగరంలోని రాజీవ్ కల్చరల్ క్లబ్బులో నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తొలుత ఆయన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ జల్లా శ్రీరాములుకు రంగస్థల నాటకమంటే ఎంతో ఇష్టమని, పలుమార్లు తిరుపతి వెంకట కవుల పాండవోద్యోగం నాటకాన్ని, అందులో భీముని పాత్రలో నటించి అందరినీ ఆకట్టుకున్నారని తెలిపారు. మందలపర్తి మురళి మాట్లాడారు. శ్రీరాములు సహచర నటులు వలసిగాండ్ల సుధాకర్, వెల్లాల వెంకటేశ్వరాచారి, బ్యాంకు గంగయ్య, హార్మోనిస్టు వెంకట సుబ్బయ్య, భూమిరెడ్డి స్వరూపరాణి, టక్కోలు సుబ్బన్న, బాల ఓబయ్య, శ్రీరాములు, సంటెన్న తదితరులు పాల్గొన్నారు.

హనుమ వాహనంపై శ్రీనివాసుడు

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటంరోడ్డులోని ఫైర్ ఆఫీసు వెనుకభాగంలో ఉన్న శ్రీమహాలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ నవమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారిని హనుమంత వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. దారి పొడవునా భక్తులు స్వామివారికి నీరు వారపోసి కాయకర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఉదయం నుంచి ఆలయంలో లక్ష్మీ నారాయణహోమం, వేదస్వస్తి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా మంగళవారం ఉదయం 9–30 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు.

మున్సిపల్ సిబ్బందికి వ్యక్తిగత రుణాలివ్వాలి



ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ నాయకులు

కడప కార్పొరేషన్ : మున్సిపల్ కార్పొరేషన్‌లో వివిధ విభాగాల సిబ్బందికి వ్యక్తిగత రుణాలు మంజూరుకు తగిన చర్యలు చేపట్టాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఈ మేరకు మున్సిపల్ కార్మికులతో కలిసి సీఐటీయూ నాయకులు ఎస్‌బీఐ (బ్యాంకు) ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులో మున్సిపల్ కార్మికులు, సిబ్బంది దాదాపు రెండు వేల మంది జీతాలు పొందుతున్నారన్నారు. అలాగే మున్సిపాలిటీ స్థాయి నుండి నగరపాలక సంస్థ వరకు ట్రెజరీ సంబంధిత లావాదేవీలు బ్యాంకు ద్వారా జరుపుతున్నారన్నారు. అయితే గత ఒకటిన్నర సంవత్సరాలుగా వ్యక్తిగత రుణాలు కోసం మున్సిపల్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అత్యవసర పరిస్థితులు, శుభకార్యాల సమయంలో డబ్బు అవసరమైనప్పుడు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. ఈ విషయంగా బ్యాంకు ఉన్నత అధికారులకు వినతి పత్రాలు సమర్పించినా సమస్యలను పరిష్కరించకపోవడం తగదన్నారు. ఈ సమస్యను పరిష్కరించకుంటే తీవ్ర ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక నేతలు సుంకర రవి, కంచుపాటి తిరుపాల్, శ్రీధర్ బాబు, సుంకర కిరణ్ కుమార్, నాగరాజు, ధరణి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.


ఎల్ఐసీ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి




ప్రతిజ్ఞ చేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

కడప కల్చరల్ : జీవిత బీమా సంస్థలో దేశవ్యాప్తంగా 2,700 ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేందుకు రిక్రూట్మెంట్ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని ఉద్యోగుల సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి అలవలపాటి రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక డివిషనల్ కార్యాలయం ఎదుట జరిగిన నిరసన ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. పని భారం ఉందని, పాలసీ సేవల్ని మరింత సంతృప్తికర స్థాయిలో అందించేందుకు నూతన నియామకాల అవసరం ఉందని ఒకవైపు అంగీకరిస్తూనే, ఇంతవరకు యాజమాన్యం ఆ దిశలో అడుగులు వేయకపోవడం బాధాకరమన్నారు. అధికారుల స్థాయిలో క్రమం తప్పకుండా రిక్రూట్మెంట్ జరుగుతోందని ఆయన గుర్తు చేశారు. మరి 3, 4 తరగతుల సిబ్బంది నియామకాల్లో ఈ నిర్లిప్తత, వివక్షత దేనికని ఆయన ప్రశ్నించారు. అలాగే 80 శాతం సిబ్బంది సభ్యులుగా ఉన్న తమ యూనియన్ 'ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్'కు తక్షణం అధికారిక గుర్తింపు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు సీనియర్ డివిజనల్ మేనేజర్ రవికుమార్‌కు వినతిపత్రాన్ని సమర్పించామని, దీనినే ఎల్ఐసి చైర్ పర్సన్ కి కూడా పంపుతున్నామన్నారు. అంతకుముందు, యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ సంఘం పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సేవల విభాగం మేనేజర్ సత్యప్రసాద్ పాల్గొన్నారు. మహిళా కన్వీనర్ అమీనా పర్వీన్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాల్లో యూనియన్ నాయకులు అక్బర్ బాషా, సుధీకర్, శంకర్ రావు, వారిజాతమ్మ, రాజు, అయ్యవారు రెడ్డి, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం



ఎద్దులతో సేద్యం చేస్తున్న రైతు



పొలం దున్నుతున్న ట్రాక్టర్

- ప్రధాన పంటగా పత్తి సాగు
- కనుమరుగవుతున్న వేరుశనగ పంట
- ప్రత్యామ్నాయ పంటలపై రైతులు మొగ్గు

వేముల : ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం పొలాలను దుక్కులు దున్ని సాగుకు సిద్ధం చేస్తున్నారు. ముంగారు వర్షాలు లేక పొలాలను దుక్కులు చేసేందుకు వీలు లేకుండా పోయింది. అంతేకాక సేద్యాలకు అదునులో వర్షాలు లేవు. రుతుపవనాల ప్రభావంతో వర్షాలు పడుతుండడంతో భూములు పదును అయ్యాయి. దీంతో ట్రాక్టర్లు, ఎద్దుల సాయంతో పొలాల్లో సేద్యాలు ముమ్మరంగా చేస్తున్నారు. ఇప్పటికే ఇదే అదున్లో పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి. అయితే సేద్యాలకు ముందుగా వర్షాలు పడకపోవడంతో భూములు బీడులుగా ఉండిపోయాయి. ఇప్పుడు పదును వర్షాలతో పొలాల్లో రైతులు సేద్యాలు చేపడుతున్నారు.

ఖరీఫ్‌లో ప్రధాన పంటగా పత్తి

ఖరీఫ్‌లో ప్రధాన పంటగా పత్తి పంట సాగవుతుంది. గత ఐదు, ఆరు సంవత్సరాలుగా రైతులు ఖరీఫ్‌లో పత్తి పంట వైపు మొగ్గు చూపుతున్నారు. పంటకు తక్కువ పెట్టుబడులు కావడంతోపాటు దిగుబడులు ఆశాజనకంగా ఉండడం రైతులకు కలిసి వస్తోంది. అంతేకాక మార్కెట్ ధరలు కూడా నిలకడగా ఉండడం, సాగులో ఆదాయం ఉండడంతో రైతులు ఆ దిశగా సాగుపై ఆసక్తి చూపుతున్నారు. పంట సాగు చేసిన నాలుగు నెలలకే దిగుబడులు అందుతున్నాయి. అయితే పంటకు తెగులు సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు కలుపు మొక్కలు తీసేందుకు అదనంగా ఖర్చులు అవుతున్నాయని రైతులు అంటున్నారు. చీడపీడల నుంచి పంటను కాపాడుకునేందుకు ముందు జాగ్రత్తలు తీసుకోవడంతో ఆశించిన స్థాయిలో దిగుబడులు ఉండడంతో రైతులకు సాగు ఊరటనిస్తోంది.

కనుమరుగవుతున్న వేరుశనగ పంట

ఖరీఫ్‌లో ఒకప్పుడు ప్రధాన పంటగా వేరుశనగ సాగయ్యేది. అయితే కాలానుగుణంగా ఖరీఫ్‌లో వేరుశనగ పంట కనుమరుగైంది. నియోజకవర్గ వ్యాప్తంగా వేల ఎకరాలలో వేరుశనగ పంటను రైతులు సాగు చేసేవారు. అయితే పంట సాగులో పెట్టుబడులు పెరిగిపోయాయి. ఆశించిన మేర దిగుబడులు అందడం లేదు. సాగులో ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడులు అవుతున్నాయని అందువల్ల వేరుశనగ పంట వైపు ఆసక్తి చూపడం లేదని రైతులు అంటున్నారు. కొంత మంది రైతులు సాగులో పెట్టుబడులు అయినప్పటికీ పంట సాగు చేసి దిగుబడులు లేక నష్టాలను చవిచూశారు.

ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు

ప్రతి ఏడాది ఒకేరకమైన పంటను సాగుచేయడం వల్ల దిగుబడులు తగ్గిపోయి నష్టపోయి ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతున్నామని రైతులు అంటున్నారు. ఖరీఫ్‌లో సకాల వర్షాలు కురిస్తే భూములు పదునులైతే ఎక్కువ మంది రైతులు పెసర, మినుము తదితర పంటల వైపు దృష్టి సారిస్తున్నారు. పంట కాలం 90 రోజులు కావడంతో రైతులు ఆ దిశగా సాగుకు సిద్ధమవుతున్నారు. పంట కాలం పూర్తయి దిగుబడులు అందిన తర్వాత రబీలో శనగ, ధనియాల పంటలను సాగు చేయవచ్చన్న ఉద్దేశంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకుంటున్నారు. ఒక పంటలో నష్టపోయినా మరో పంటలో ఆదాయం ఉంటుందనే ఉద్దేశంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గుచూపుతున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఉప విద్యాశాఖాధికారి కృష్ణప్ప

వీరపునాయునిపల్లె : పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ప్రొద్దుటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి కృష్ణప్ప పేర్కొన్నారు. సోమవారం మండల పరిధి పాయసంపల్లె గ్రామంలోని కందుల మంగమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. పిల్లలతోపాటు ఆయన అక్కడే భోజనం చేశారు. వంట చేయు ప్రాంతాన్ని రోజూ శుభ్రంగా ఉంచుకోవాలని, అంతే కాకుండా వంట చేసే సమయంలో చాలా జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా ఉండేందుకు నిరంతరం ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.

ఫుడ్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థినుల ప్రతిభ



చింత శ్రీలేఖ



చైతన్య

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని చిన్నరంగాపురం సమీపంలో ఉన్న ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనపరిచారు. 2023–24లో కళాశాలలో చదివిన విద్యార్థినులు పలు పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచారు. జాతీయ, అంతర్జాతీయ ప్రతిష్టాత్మక యూనివర్సిటీలలో ప్రవేశం పొందారని పులివెందుల, ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకొచ్చారని కళాశాల అసోసియేట్ డీన్ ఎం.ఎస్.బేగ్ తెలిపారు. 4వ సంవత్సరం విద్యార్థిని చింత శ్రీలేఖ పీజీసెట్ ఫుడ్ టెక్నాలజీ విభాగంలో రాష్ట్రంలోనే ప్రథమ ర్యాంకు సాధించడం తమ కళాశాలకు గర్వకారణమన్నారు. మరొక విద్యార్థిని చైతన్య కూడా విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు జీఆర్ఈ టోఫెల్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపరచి అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ జార్జియాలో ఎంఎస్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో చదివేందుకు సీటు పొందిందని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులను, విద్యార్థినులను ఆయన అభినందించారు.